రైతులుగా మారిన కలెక్టర్ దంపతులు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు ఆదివారం కొద్దిసేపు రైతుల అవతారమెత్తారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న ఔరంగాబాద్ గ్రామంలో గొల్ల నారాయణ అనే రైతు పొలంలో తమ ఇద్దరు పిల్లలతో కలిసి పొలం పనులు చేశారు. వరినారు పీకి, రైతులతో కలిసి ఉత్సాహంగా నాట్లు వేశారు. రైతులతో ఆప్యాయంగా మాట్లాడి వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. నారుమడి నుంచి పంట అమ్మకం వరకు ప్రతి దశలో రైతుకు అండగా అంటూ అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. – మెదక్ అర్బన్

దేవుడా.. ఇది దేవాదుల కాలువేనా?

బీఆర్‌ఎస్ హయాంలో గోదావరి జలసవ్వడులతో కాలువలు కళకళలాడగా.. ప్రస్తుతం దేవాదుల కాలువలు నీటి ప్రవాహం లేక అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు పెరగ్గా, మట్టి పేరుకుపోయి నీళ్లు ముందుకు వెళ్లలేని విధంగా తయారయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నాగపురి తదితర గ్రామాలకు కుడి కెనాల్ ద్వారా నీటిని అందించే దేవాదుల కాలువ మొత్తం పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈ దృశ్యాన్ని నాగపురి-శభాష్‌గూడెం సమీపంలో 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది. – చేర్యాల

రాచకొండలో అరాచకకాండ!

మొదటిపేజీ తరువాయి...

ఈ భూములన్నీ వివాదాలకు దారితీసే అవకాశం ఉండటంతో ముందుగానే అరికట్టాల్సిన రెవెన్యూ యంత్రాంగం మాత్రం ఇదే అదనుగా కాసుల పండుగ చేసుకుంటున్నది.సుమారు మూడు దశాబ్దాల కిందట ఆకుల రాజయ్య అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్దఎత్తున రాచకొండ పరిధిలో భూములను కొనుగోలు చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని లోయపల్లి, బోడకొండ, ఎల్లమ్మతండా, బుగ్గతండా, ఆరుట్ల, బండాలేమూర్, చెన్నారెడ్డిగూడ, ముచ్చర్లకుంట తండా, దాత్‌పల్లి, చీదేడు, పటేల్‌చెర్వుతండా, తిప్పాయిగూడ తదితర గ్రామాల్లో కొండలు, గుట్టలు ఉన్న భూముల్ని వేల ఎకరాల్లో కొనుగోలు చేయటం అప్పట్లో ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ భూములను ఆయన పలు సంస్థలకు విక్రయించారు. వాస్తవానికి రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేయించకుండానే కేవలం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ (సేల్ డీడ్) ఆధారంగానే ఈ విక్రయాలు జరిపారు. దీంతో డాక్యుమెంట్ల ప్రకారం ఆ భూములు పలు బడా సంస్థల పేరిట ఉన్నప్పటికీ.. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం పాత పట్టాదారుల పేర్లు కొనసాగుతున్నాయి. ఈ భూములను కొనుగోలు చేసిన పలు సంస్థలు వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టి రూ.కోట్ల రుణాలు తీసుకున్న అంశం కూడా అప్పట్లో పెద్ద వివాదానికి దారితీసింది. అనంతరం జరిగిన పరిణామాల దరిమిలా కొన్ని సంస్థల భూములను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసుకున్నది. ఆ పై వాటిలో కొన్నింటిని కొన్నేండ్ల కిందట రిలీజ్ చేసింది.

కాలక్రమేణా భారీ డిమాండ్

రాచకొండ ప్రాంతమనేది నగరానికి సమీపంలోనే ఉన్నది. తెలంగాణలో మారుమూల ప్రాంతంలోనే ఎకరా భూమి ధర కనీసంగా రూ.20-30 లక్షల వరకు ఉన్నదంటే ఈ భూముల ధరలు ఇప్పుడు కనీసంగా రూ.50-60 లక్షలకుపైగా ధర పలుకుతున్నాయి. గతంలో కొనుగోలు చేసిన సంస్థలు మ్యుటేషన్ చేయించుకోకపోవటంతో రెవెన్యూ రికార్డుల్లో ఆయా సంస్థల పేర్లు నమోదు కాలేదు. ఈ నేపథ్యంలో భూ రికార్డుల ప్రక్షాళన జరగటంతో పాత పట్టాదారుల పేరు మీదే పాసు పుస్తకాలు వచ్చాయి. ఆ సమయంలోనైనా కనీసం సదరు సంస్థలు ముందుకొచ్చి మ్యుటేషన్‌కు ప్రయత్నించలేదు. దీంతో రైతుల పేరిటే రెవెన్యూ రికార్డుల్లో భూములు కొనసాగుతున్నాయి. గత కొన్నేండ్లుగా ఈ భూములకు డిమాండ్ పెరగటంతో రియల్ బ్రోకర్లు పెద్దఎత్తున ఈ భూములపై కన్నేసి, హైదరాబాద్‌కు చెందిన పలు రియల్ వ్యాపారులు, సంస్థలను సంప్రదిస్తున్నారు. తక్కువ ధరకే భూములు లభిస్తున్నాయంటూ రైతుల నుంచి రూ.10-15 లక్షలకే కొనుగోలు చేస్తున్నారు. రైతులు కూడా గతంలోనే విక్రయించిన భూములు.. మళ్లీ మరో అవకాశం వచ్చిందనే ఉద్దేశంతో విక్రయానికి అంగీకరిస్తున్నారు.

పాస్‌బుక్.. ఆన్‌లైన్ ప్రామాణికంగా..

ఈ భూముల విక్రయం గతంలోనే జరిగినప్పటికీ ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో పాత రైతుల పేర్లు ఉండటంతో డబుల్ రిజిస్ట్రేషన్‌కు ఆస్కారం ఏర్పడింది. రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలిసినా తాజా పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్‌ను ప్రామాణికంగా తీసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. గతంలోనే ఈ భూములపై వివాదాలు నెలకొనటం, చాలా భూములపై బ్యాంకుల్లో రుణాలు తీసుకొన్న దాఖలాలు ఉన్న దరిమిలా అధికారులు అప్రమత్తమై.. ఈసీలు (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) పరిశీలిస్తే సులువుగా గతంలోనే విక్రయం జరిగినట్టు తేలుతుంది. కానీ ఉద్దేశపూర్వకంగానే అధికారులు విస్మరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంచాల మండల పరిధిలోని గ్రామాలతో పాటు ఇబ్రహీంపట్నం మండలంలోనూ భూముల డబుల్ విక్రయాలు జరిగినట్టు తెలిసింది.

తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రైవేట్ వ్యక్తులు

మంచాల తహసీల్దార్ కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులదే ఇష్టారాజ్యం నడుస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. ఒక ప్రైవేటు వ్యక్తి కనుసన్నల్లోనే అధికార యంత్రాంగం నడుచుకుంటూ.. డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఒక మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు మంచాల తహసీల్దార్ కార్యాలయంలోని అవుట్‌సోర్సింగ్ ఆపరేటర్లు ఎలాంటి విచారణ లేకుండా.. ఆర్ఐ, తహసీల్దార్‌కు తెలియకుండానే డిజిటల్ సంతకంతో ధ్రువీకరణ పత్రాలు జారీచేశారు. ఈ కుంభకోణం కొన్ని రోజుల కిందటే బయటపడింది. తాజాగా ఇదే కార్యాలయంలో డబుల్ రిజిస్ట్రేషన్ల వ్యవహారం జరుగుతుండటం గమనార్హం. ఈ అంశంపై మంచాల తహసీల్దార్ కేవీవీ ప్రసాదరావును 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా డబుల్ రిజిస్ట్రేషన్ల వ్యవహారం తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు.

భూవివాదం నేపథ్యం.. రైతు ఆత్మహత్యాయత్నం

- పోలీసులు న్యాయం చేయడం లేదంటూ సెల్ఫీ వీడియో పోస్ట్
- ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్‌తండాలో ఘటన

ఖమ్మం రూరల్, ఆగస్టు 4: భూవివాదం నేపథ్యంలో పురుగుమందు తాగి ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం చోటుచేసుకున్నది. బాధిత రైతు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జాన్‌బాద్‌తండాకు చెందిన ఏలేటి వెంకటరెడ్డికి మూడు ఎకరాల భూమిని ఉన్నది. అతడి సోదరుడు భూపాల్‌రెడ్డి.. అదే గ్రామానికి చెందిన జాటోత్ వీరన్న దగ్గర కొంత అప్పు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో ఆయన భూమిని వీరన్న స్వాధీనం చేసుకున్నాడు. భూపాల్‌రెడ్డి భూమి పక్కనే వెంకటరెడ్డి భూమిని వీరన్న ఆక్రమించాడు. ఆదివారం వీరన్న ట్రాక్టర్‌తో వెంకటరెడ్డి పొలాన్ని దున్నుతుండగా.. వెంకటరెడ్డి దున్న వద్దంటూ వేడుకున్నాడు. అయినప్పటికీ వినిపించుకోకపోవడంతో పోలీసుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదు. ఎనిమిదేండ్లుగా ఇబ్బంది పడుతున్నానంటూ పొలం వద్ద సెల్ఫీ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టుచేశాడు. ఆ తరువాత పురుగుల మందు తాగాడు. వెంకట్‌రెడ్డి ప్రస్తుతం దవాఖానలో చికిత్స పొందుతున్నట్టు ఖమ్మం రూరల్ ఎస్సై రామారావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

డైట్.. సమస్యలతో ఫైట్!

- పాలమూరులో విద్యా శిక్షణ సంస్థలో 29 మంది బోధకులకు కేవలం ఇద్దరే
- 300 మందికి రెండే మరుగుదొడ్లు
- భావి గురువుల బాధలు పట్టవా?

మూత్రశాల వద్ద బారులుదీరిన విద్యార్థినులు

బకెట్‌తో నీటిని తీసుకెళ్తున్న సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చిన విద్యార్థిని బంధువు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 4 : మహబూబ్‌నగర్ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు తలమానికంగా నాడు కళకళలాడిన ఈ కాలేజీ నేడు అధ్యాపకుల కొరత, అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నది. కనీస సదుపాయాలు కూడా లేకపోవటంతో విద్యార్థినులు, అధ్యాపకులు ఆవేదనకు గురవుతున్నారు. ఏటా సమర్థులైన 150 మంది ఉపాధ్యాయులను తయారు చేయడమే లక్ష్యంగా ఈ కళాశాలను 1989లో ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్‌తోపాటు 29 మంది అధ్యాపకులు ఉండాల్సిన చోట కేవలం ఇద్దరు బోధకులతోనే నెట్టుకొస్తున్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్ మీడియంలో ప్రథమ సంవత్సరంలో 150, ద్వితీయ సంవత్సరంలో 150 మంది విద్యార్థులు ఏటా సరాసరి 300 మంది విద్యనభ్యస్తుంటారు. కళాశాలలో ఇంతమందికి కేవలం రెండే మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయి. బాలురకు మూత్రశాలలు లేకపోవడంతో వారు ఆరుబయటకు, చెట్ల చాటుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. స్వచ్ఛత గురించి చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యలను మాత్రం పట్టించుకోవటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ లేకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఇచ్చిన నల్లా ద్వారా వచ్చే కొద్దిపాటి నీటిని నిల్వ చేసుకుని వాటినే మూత్రశాలల్లో వాడుకోవాల్సి వస్తున్నది. సరిపోను నీళ్లు లేకపోవటంతో మూత్రశాలలు, మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. హాస్టల్ వసతి లేక.. ప్రైవేటులోనే విద్యార్థినులు అధిక డబ్బులు వెచ్చించి అద్దెగదుల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. శనివారం డైట్‌లో నిర్వహించిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు వచ్చిన విద్యార్థులు, వారి బంధువులు, సహాయకులు సైతం కనీస వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డైట్ కళాశాల సమస్యలను జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు విన్నవించామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మేరాజుల్లాఖాన్ తెలిపారు. కలెక్టర్, డీఈవో దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు తీరుస్తామని చెబుతూనే ఉన్నారని పేర్కొన్నారు.

సిరిసిల్లలో నేతన్నలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేస్తున్న అదనపు కలెక్టర్

ఫలించిన నేతన్నల చర్చలు.. రిలే దీక్ష విరమణ

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు చేపట్టిన రిలేదీక్షలను ఆదివారం విరమించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆధ్వర్యంలో సమీకృత కలెక్టరేట్‌లో మరమగ్గాల ఉత్పత్తిదారులు, ఆసాములు, కార్మిక సంఘాల నేతలు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జేఏసీ నేతలతో చర్చలు జరిపారు. నేతన్నల డిమాండ్లను ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని విప్ హామీ ఇచ్చారు. అందుకు అంగీకరించిన జేఏసీ నేతలు దీక్షలను విరమించేందుకు అంగీకరించారు. సాయంత్రం అంబేద్కర్ చౌరస్తాలోని దీక్షా శిబిరానికి చేరుకున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ దీక్షలో కూర్చున్న నేతలకు నిమ్మరసం ఇచ్చి విరమింపచేశారు.

విజువల్ వండర్‌గా క్లైమాక్స్

అగ్రనటుడు చిరంజీవి నటిస్తున్న సోషియోఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర' షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఓ వైపు ప్రొడక్షన్, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ జరుపుకుంటున్న ఈ సినిమా చిత్రీకరణ క్లైమాక్స్‌కు చేరుకుంది. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో ఈ క్లైమాక్స్‌ని దర్శకుడు వశిష్ఠ ప్లాన్ చేశారు. ఈ క్లైమాక్స్ విజువల్ వండర్‌గా వుండబోతున్నదని, ఈ సీక్వెన్స్‌లో ఫాంటసీ ఎలిమెంట్స్ హైలైట్ కానున్నాయని వశిష్ఠ తెలిపారు. ఇండియన్ టాప్ యాక్షన్ కొరియోగ్రాఫర్ ఆన్ల్ అరుసు నేతృత్వంలో ఈ క్లైమాక్స్‌ని తెరకెక్కించనున్నామని, వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 10న సినిమా విడుదల కానున్నదని మేకర్స్ తెలిపారు. త్రిష, అషికా రంగనాథ్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో కునాల్‌కపూర్ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, నిర్మాతలు: విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మాణం: యూవీ క్రియేషన్స్.

వయనాడ్ బాధితులకు కోటి విరాళం: విపత్తులు ఎదురైనప్పుడు ప్రజలకోసం నిలబడే కొద్దిమంది ప్రముఖుల్లో చిరంజీవి ఒకరు. కేరళ వయనాడ్ బాధితుల కోసం చిరంజీవి ముందుకొచ్చారు. తన పెద్ద మనసును చాటుకుంటూ తన కుమారుడు రామ్‌చరణ్‌తో కలిసి కోటి రూపాయిలు విరాళంగా ప్రకటించారు. త్వరలో ఆ మొత్తాన్ని కేరళ ప్రభుత్వానికి అందజేస్తామని వారు తెలిపారు.

ఇస్మార్ట్ శంకర్‌కి ఇది అప్‌డేట్ వెర్షన్

' 'ఇస్మార్ట్ శంకర్' మెంటల్ మ్యాడ్‌నెస్ కేరక్టర్. 'డబుల్ ఇస్మార్ట్' వాడికి అప్‌డేట్ వర్షన్. పూరీ ఎక్కువ టైమ్ తీసుకొని రాసిన కథ ఇది. కమర్షియల్ సినిమా ఇచ్చే అసలైన కిక్కును ఈ సినిమా రుచి చూపిస్తుంది. అది రేపు థియేటర్లలో చూస్తారు.' హీరో రామ్ పోతినేని అన్నారు. ఆయన హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. పూరీజగన్నాథ్, ఛార్మీ కౌర్ కలిసి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో ఏర్పాటు చేసిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రామ్ మాట్లాడారు. సి సెంటర్స్‌లో విజిల్స్ వేస్తూ చూడాల్సిన సినిమా ఇదని, తప్పకుండా అందరికీ నచ్చుతుందని, ముంబైలో ఫైనల్ మిక్సింగ్‌లో ఉండి ఈవెంట్‌కి రాలేకపోయానని దర్శకుడు పూరీజగన్నాథ్ లైవ్ వీడియోలో చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

చారిత్రక ఘటనకు తెరరూపం తంగలాన్

'వందేళ్ల క్రితం జరిగిన కథ 'తంగలాన్'. ఇదొక అడ్వెంచరస్ మూవీ. పా రంజిత్ తన ఆర్ట్ ఫామ్‌లో అందంగా తెరకెక్కించాడు. తను నా డ్రీమ్ డైరెక్టర్. ఇన్నాళ్లకు తనతో పనిచేసే అవకాశం కుదిరింది. ఇందులో రివీల్ చేయని సర్‌ప్రైజులు చాలా ఉన్నాయి. అవేంటో రేపు థియేటర్లో చూస్తారు.' అని చియాన్ విక్రమ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'తంగలాన్'. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ కథానాయికలు. పా రంజిత్ దర్శకుడు. కేఈ జ్ఞానవేల్‌రాజా నిర్మాత. ఈ నెల 15న సినిమా విడుదలకానుంది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో విక్రమ్ మాట్లాడారు. అణచివేత, అసమానత్వాన్ని ఎదుర్కొనేందుకే తాను సినిమా మాధ్యమాన్ని ఎంచుకున్నానని, స్వాతంత్ర్యానికి పూర్వం జరిగి ఓ చారిత్రక ఘటనకు తెరరూపమే 'తంగలాన్' అని, ఇది స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం జరిగే పోరాటమని, పాత్రని అర్థం చేసుకొని నటించే విక్రమ్ లాంటి నటుడు దొరకడం తమ అదృష్టమని దర్శకుడు పా రంజిత్ తెలిపారు.

చిత్రం

హరితహారమే ఈ కథకు ప్రేరణ

'నిర్మాత రాజేందర్ మంచి సందేశాత్మక చిత్రాన్ని నిర్మించారని తెలుస్తున్నది. ఇలాంటి సినిమాలు మరిన్ని రావాలి. మంచి విజయాలను అందుకోవాలి. 'సింబా' సినిమాకోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆల్‌ది బెస్ట్. సినిమా ఈవెంట్‌కి వచ్చాం.. వెళ్లాం.. అని కాకుండా.. అందరూ మొక్కలు నాటండి. రాష్ర్టాన్ని పచ్చగా ఉంచండి.' అని మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ అన్నారు. జగపతిబాబు, అనసూయ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. మురళీ మనోహర్ దర్శకుడు. సంపత్‌నంది, దాసరి రాజేందర్ రెడ్డి నిర్మాతలు. ఈ నెల 9న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కి సంతోష్‌కుమార్ అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నిర్మాతల్లో ఒకరైన సంపత్‌నంది మాట్లాడుతూ 'ఈ సినిమా మొదలవ్వడానికి కారణం ఉదయభాను. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా తను నన్ను ఛాలెంజ్ చేసింది. ఆ తర్వాత సంతోష్‌గారు, కేసీఆర్‌గారు తలపెట్టిన హరితహారం గురించి తెలుసుకున్నా. ఆ టైమ్‌లోనే ఈ కథ అనుకున్నా. అందరికీ కనువిప్పు కలిగేలా, వినోదాన్ని పంచేలా ఉండే సందేశాత్మక కథాంశమిది. నా సహ నిర్మాత రాజేంద్రరెడ్డికి ఈ కథతో పాటు మంచి కమర్షియల్ కథలు కూడా చెప్పా. కానీ ఆయన ఈ కథే ఎంచుకున్నారు. సమాజానికి మంచి చేయాలి, మనకి ఇంత ఇచ్చిన సమాజానికి ఏదైనా తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో నిర్మించిన సినిమా ఇది' అని తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులతోపాటు తెలంగాణ శాసనసభ్యులు విజయ రమణారావు, రాజ్ ఠాకూర్ కూడా మాట్లాడారు. .

సయ్యారే సయ్యా..

ప్రియదర్శి, నివేతా థామస్, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతోన్న న్యూఏజ్ క్లీన్ ఎంటర్టైనర్ '35 – చిన్న కథ కాదు'. రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రానికి నందకిశోర్ దర్శకుడు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమాలోని తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. 'సయ్యారే సయ్యా..' అంంటూ సాగే ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రాయగా, వివేక్ సాగర్ స్వరపరిచారు. కార్తీక్ ఆలపించారు. స్నేహం గొప్పతనాన్ని తెలిపేలా ఈ పాట సాగిందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, నిర్మాణం: సురేశ్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్.

రిపోర్టు.. రిజల్టు.. రెండూ బావున్నాయి

'సినిమాను 200 థియేటర్లు విడుదల చేశాం. వస్తున్న స్పందన చూసి మరో 28 థియేటర్లు పెంచాం. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకదేవుళ్లకు ధన్యవాదాలు. సినిమా రిపోర్ట్, రిజల్ట్ బావున్నాయి. దర్శకుడు రవికుమార్‌చౌదరి చెప్పినదానికంటే గొప్పగా తీశారు. సాంకేతికంగా అన్ని విధాలా సినిమా బావుంది. అందుకే ఇంత మంచి స్పందన.' అని మల్కాపురం శివకుమార్ అన్నారు. రాజ్‌తరుణ్ హీరోగా ఏ.ఎస్.రవికుమార్‌చౌదరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'తిరగబడరసామి'. ఇటీవల సినిమా విడుదలైంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడారు. 'సినిమాను ప్రేమించే నిర్మాత శివకుమార్. అడిగిన ఆర్టిస్టులను ఇచ్చారు. మంచి లొకేషన్స్ ఇచ్చారు. కోరిన టెక్నీషియన్స్‌ని ఇచ్చారు. సినిమాకోసం ఏడడిగినా కాదనలేదు. ఈ విజయానికి ప్రధాన కారణం ఆయనే' అని రవికుమార్ చౌదరి అన్నారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

సినీ చరిత్రలోనే మైలురాయి బలగం

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బలగం డైరెక్టర్ వేణుకు అభినందన
- బలగంకు మొదటి నుంచీ అండగా కేటీఆర్
- సినిమా షూటింగ్ అంతా సిరిసిల్లలోనే

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): సినీ చరిత్రలోనే 'బలగం' సినిమా మైలురాయిగా నిలిచి, మూడు ఫిలింఫేర్ అవార్డులను గెలుచుకోవడం పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హర్షం వ్యక్తంచేశారు. బలగం సినిమాకు ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటి అవార్డులు లభించిన నేపథ్యంలో ఈ సినిమా డైరెక్టర్ వేణు యెల్దండితోపాటు సినీ యూనిట్‌కు అభినందనలు తెలియజేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలోని నేత కార్మిక కుటుంబానికి చెందిన వేణు యెల్దండి కష్టపడి ఎదిగి 'బలగం' అనే గొప్ప సినిమాను తీశారని కొనియాడారు. రాజన్న-సిరిసిల్ల జిల్లాలో ఈ సినిమా తీసిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. వేణుతోపాటు అతని టీం కష్టానికి దక్కిన ఫలితం ఈ ఫిలింఫేర్ అవార్డులని అభివర్ణించారు. తెలంగాణ సంస్కృతిలో భాగమైన 'పిట్ట ముట్టుడు' ఇతివృత్తంతో తీసిన 'బలగం' సినిమా కొట్లాది తెలుగు ప్రేక్షకుల మనస్సులను దోచింది. చిన్న బడ్జెట్‌తో తీసిన బలగం సినిమా రూ.40 కోట్లకుపైగా వసూళ్ల రాబట్టి రికార్డు సృష్టించడమే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో భారీస్క్రీన్లు పెట్టి ఈ సినిమాను ప్రదర్శించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. గ్రామ చావడి వద్ద గ్రామస్థులంతా కలిసి కొన్ని ఏండ్ల తర్వాత చూసిన సినిమా 'బలగం' అని పేర్కొన్నారు.

వేణుకు మొదటి నుంచీ కేటీఆర్ అండ

'బలగం' సినిమా ఎక్కడో తీయడం ఎందుకు రాజన్న-సిరిసిల్ల జిల్లాలో అద్భుతమైన లోకేషన్లు ఉన్నాయి. మన దగ్గరే తీయండి. అన్ని విధాల సహకరిస్తా' అని చిత్ర దర్శకుడు వేణుకు కేటీఆర్ అభయం ఇచ్చారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌కు ఈ సినిమా నిర్మాత దిల్‌రాజు కూడా సన్నిహితుడు కావడంతో సిరిసిల్లలో ఈ సినిమా మొత్తం షూట్ చేశారు. కోనసీమను తలపించే పచ్చని పొలాలు.. మెట్టప్రాంతమైన సిరిసిల్లలో కూడా ఉన్నాయా? అని ఆశ్చర్యపోయిన ప్రేక్షకులు అప్పట్లో కాళేశ్వరం జలాల గొప్పతనాన్ని చర్చించుకున్నారు. సినీ షూటింగ్ మాత్రమే కాకుండా కేటీఆర్ సూచన మేరకు ప్రీరిలీజ్ ఈవెంట్‌ను కూడా సిరిసిల్లలోనే నిర్వహించడం విశేషం. ఒక సినిమా ఫంక్షన్ చిన్న జిల్లా కేంద్రంలో నిర్వహించడం తెలుగు సినీచరిత్రలోనే ఇదే మొదటిదని చెప్తున్నారు. మంత్రిగా బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ, నాడు కేటీఆర్ ప్రీరిలీజ్ ఈవెంట్‌కు హాజరై శుభాకాంక్షలు తెలియజేయడం మరో విశేషం. మరోవైపు నాడు అసెంబ్లీ సాక్షిగా 'బలగం' సినిమా విశేషాలను కేటీఆర్ ఉదహరించిన సందర్భాలున్నాయి.

ఇది తెలంగాణకే గర్వకారణం

సౌతిండియన్ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్‌లో 'బలగం' ఉత్తమ చిత్రంగా నిలవడంతోపాటు పలు విభాగాల్లో అవార్డులు గెలుచుకోవడం పట్ల తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, థియేటర్స్ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అనిల్ కుర్మాచలం ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిత్రయూనిట్‌కి ఆయన శుభాకాంక్షలు అందించారు.

69 శోభ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024 తెలుగు విజేతలు

- **ఉత్తమ చిత్రం** – బలగం
- **ఉత్తమ నటుడు** – నాని
- **ఉత్తమ నటి** – కీర్తి సురేశ్
- **ఉత్తమ దర్శకుడు** – వేణు యెల్దండి
- **ఉత్తమ పరిచయ దర్శకుడు** – శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న)
- **ఉత్తమ చిత్రం (క్రిటిక్స్)** – బేబీ (దర్శకుడు సాయిరాజేశ్)
- **ఉత్తమ నటుడు (క్రిటిక్స్)** – నవీన్ పోలిశెట్టి (మిస్ శెట్టి-మిస్టర్ పోలిశెట్టి), ప్రకాశ్‌రాజ్ (రంగమార్తాండ)
- **ఉత్తమ సహాయ నటుడు** – రవితేజ (వాల్తేరు వీరయ్య), బ్రహ్మానందం (రంగమార్తాండ)
- **ఉత్తమ సహాయనటి** – రూప లక్ష్మీ (బలగం)
- **ఉత్తమ గాయకుడు** – శ్రీరామచంద్ర ('బేబీ' సినిమాలోని 'ఓ రెండు ప్రేమ మేఘాలిలా..' సాంగ్)
- **ఉత్తమ గాయని** – శ్వేతా మోహన్ ('సార్' సినిమాలోని 'మాస్టారు.. మాస్టారూ.. సాంగ్)
- **ఉత్తమ గేయ రచయిత** – అనంతశ్రీరామ్ ('బేబీ' సినిమాలోని 'ఓ రెండు ప్రేమ మేఘాలిలా..' సాంగ్)
- **ఉత్తమ సంగీతం** – విజయ్ బుల్గానిన్ (బేబీ)
- **ఉత్తమ సినిమాటోగ్రఫీ** – సత్యన్ సూరన్ (దసరా)
- **ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్** – కొల్లా అవినాష్ (దసరా)
- **ఉత్తమ కొరియోగ్రఫీ** – ప్రేమ్ రక్షిత్ (ధూమ్ ధామ్ దోస్తానా.. సాంగ్ (దసరా)